ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 25 | మార్చి | 2024
పేజీలు 7

## కాగడాలతో కదం తొక్కిన యువత



భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని పురవీధుల్లో ప్రదర్శన

6లో

# అదరగొడుతున్న ఎండలు.. ఇంకిపోతున్న భూగర్భ జలాలు..!



ఇప్పుడిప్పుడే కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. గతేడాది వర్షాభావ ప్రభావం కనిపిస్తుంది. దానికి తోడు విపరీతమైన ఎండలు భవిష్యత్తును తలచుకుంటే భయపెట్టేలా ఉన్నాయి. మార్చి చివరిలో ఎండ తీవ్రతను పరిశీలిస్తే ఏప్రిల్, మే మాసాల సంగతేమిటన్న ఆలోచన ప్రజలను భయపెడుతుంది. తీవ్రమైన ఎండ వేడిమికి తోడు భూ గర్బ జల నీటిమట్టం రోజు రోజుకు కుంగిపోతుంది.

- చెరువుల్లో లేస్తున్న దుమ్ము
- అప్పుడే మొదలైన నీటి ఎద్దడి

2లో

## హోలీ.. సంబురాల కేళీ





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : రంగు రంగుల పండుగా హోలీ రానే వచ్చింది. ఇక పిల్లలు ఆట పాటలకు, కలర్ ఫుల్ నవ్వులు వేళైంది. పాల్గున మాసంలో వచ్చే ఈ పండుగకు అత్యంత ప్రాధాన్యత ఉంది. హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నారు. ఈ సంబురాన్ని జరుపుకునే సందర్భంగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. రసాయన రంగులను చల్లుకోవడం ద్వారా దుష్ప్రభావాలు ఉంటాయని సూచిస్తున్నారు. రంగులు పూసుకుని మధ్యం సేవించి రోడ్లపై ఇష్టాను సారంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుని తీరుతామని ఎస్పి రోహిత్ రాజ్ ఇప్పటికే హెచ్చరించారు.

పూర్వం నుండి వస్తున్న అనేక రగాల విభేదాలు, వర్గాలను తావులేకుండా చేసేందుకు అనాధిగా హోలీ వేడుకను జరుపుకుంటారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు ఈ వేడుకలో పాల్గొని సంబురాలు చేసుకుంటారు. మారుతున్న కాలానికి

మిగతా 2లో..

- రంగుల పండుకకు సర్వం సిద్ధం
- ఆలయాల్లో హోమాలు, పూజలు
- సహజరంగులు ఎంతో మేలు

## తల్లిని చంపిన కసాయి



ఆస్తి తగాదాల విషయంలో కొడుకు కసాయిగా మారి విచక్షణారహితంగా తల్లిపై దాడి చేసి హత్య చేసిన ఘటన ఖమ్మం నగరంలోని రామన్నపేట కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది.

2లో

## వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది..?

- 1/70 యాక్ట్‌కు తూట్లు పొడుస్తూ రిజిస్ట్రేషన్
- అంత అటెండర్ కనుసైగల్లోనే..
- దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది ఎవరు?
- రిజిస్ట్రార్ కార్యాలయం అవరణలోనే డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలు
- ఏజెన్సీ యాక్ట్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు..?




2లో

## అదరగొడుతున్న ఎండలు..

# ఇంకిపోతున్న భూ గర్భ జలాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇప్పుడిప్పుడే కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయి. గతేడాది వర్షాభావ ప్రభావం కనిపిస్తుంది. దానికి తోడు విపరీతమైన ఎండలు భవిష్యత్తును తలచుకుంటే భయపెట్టేలా ఉన్నాయి. మార్చి చివరిలో ఎండ తీవ్రతను పరిశీలిస్తే ఏప్రిల్, మే మాసాల సంగతేమిటన్న ఆలోచన ప్రజలను భయపెడుతుంది. తీవ్రమైన ఎండ వేడిమికి తోడు భూ గర్భ జల నీటిమట్టం రోజు రోజుకు కుంగిపోతుంది. గత పదేళ్ల కాలంలో ఎండిపోని బావులు, బోర్లు సైతం ఎండి పోతున్నాయి. చాలా ప్రాంతాలలో భూ గర్భ జల నీటి మట్టం కనిష్ట స్థాయికి పడిపోయిందని అధికార యంత్రాంగమే తెలియజేస్తుంది. కేవలం 20 రోజుల్లో మూడు నుంచి ఐదు అడుగుల మేర భూ గర్భ జల నీటి మట్టం పడిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో ప్రధాన నీటి వనరుగా ఉన్న వాగులు, ఏర్లు, చెరువుల్లో చూసేందుకు సైతం చుక్కనీరు లేదు. ప్రధానమైన మున్నేరు, వైరా, కట్టలేరు, కిన్నెరసానితో పాటు జీవనది అయిన గోదావరిలో సైతం నీళ్ల కదలికలు లేవంటే అతిశయోక్తి కాదు. మార్చి చివరి వారంలోనే ఏజెన్సీ నీటి కోసం అల్లాడుతుంది. నీటి వనరుల్లో దుమ్ము లేచిపోతుంది. ఎప్పుడు ఎండిపోని చెరువులు సైతం చుక్క నీరు లేకుండా ఇంకిపోయి ఎడారులను తలపిస్తున్నాయి. నదులు, వాగుల సమీప గ్రామాలలో నీటి ఇబ్బందులు మొదలయ్యాయి. పల్లె ప్రాంతాల పరిస్థితి ఈవిధంగా ఉంటే పట్టణాలలో మళ్లీ ట్యాంకర్ల రోద మొదలైంది. మిషన్ భగీరథ పేరుతో ఇంటింటికి నీరంటూ కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా మళ్లీ బిందెలు పట్టుకుని ట్యాంకర్ల వద్ద సిగపట్లు పట్టే రోజులు దాపురించాయి. మిషన్ భగీరథకు ఆయుపట్టువుగా ఉన్న వైరా, పాలేరు జలాశయాలు కనిష్ట నీటి మట్టానికి చేరాయి. కొద్ది రోజుల క్రితం నాగార్జున సాగర్ జలాలతో భూ గర్భ జల నీటి మట్టాన్ని పెంచడంతో పాటు నాలుగు లక్షల జనాభా ఉన్న ఖమ్మం పట్టణానికి నీరందించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు సాగర్ కనిష్ట నీటి మట్టానికి చేరుకోవడంతో మరో దఫా కాలువల ద్వారా నీరొచ్చే అవకాశం కూడా లేదు. పరిస్థితి దయనీయంగా మారింది. మరో రెండు నెలల పాటు నిండు వేసవి ఉండగా ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎలా అన్న ఆందోళన అధికారుల్లోను ఉంది. సమీక్షా సమావేశాలు పెడుతున్నారు. నీటి కరువు రానివ్వకుండా చర్యలు తీసుకోవాలి అంటున్నారు తప్ప ఎలా



అన్నది వారికి అంతు పట్టడం లేదు. వందల అడుగులు వేసినా కొన్ని గ్రామాల్లో బోరు బావుల నుంచి చుక్క నీరు సైతం రావడం లేదన్నది వాస్తవం. నీటి కరువు ఈవిధంగా ఉంటే విద్యుత్ సరఫరా సైతం అత్తుబిత్తుగానే ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండవ పంట వేయవద్దని అధికారులు సూచించినా అక్కడక్కడ స్థానిక నీటి వనరులను నమ్ముకుని రెండవ పంట సాగు చేసిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. ప్రతి ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన తర్వాత కండ్ల ముందే పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. యుద్ధ ప్రాతిపదికపై ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభిస్తే తప్ప నీటి ఎద్దడిని తట్టుకునే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యేకంగా నీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయించాలని ప్రత్యేకాధికారులను నియమించాలని కోరుతున్నారు. కనీసం కొద్ది రోజుల్లో చేతికొచ్చే పంటలనైనా కాపాడేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలని ప్రజలు పాలకులకు, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.





## వైరా సబ్ రిజిస్ట్రార్

# కార్యాలయంలో ఏం జరుగుతుంది?

**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అసలు ఏం జరుగుతుంది. దళారి వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటి? మూడు మండలాల్లో గ్రామగ్రామానికి ఓ దళారీలను ఏర్పాటు చేసింది ఎవరు? కొంతమంది డాక్యుమెంటరీ రైటర్లు దళారులు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏమిటి. లోన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి అందినకాడికి దోచుకుంటున్నారు. అసలు ఈ యంత్రాంగం మొత్తం ఒక చైన్ సిస్టంల పనిచేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ యాక్ట్ 1/70 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్‌లపై అనుసరించాల్సిన విధివిధానాలను పరిగణనలోకి తీసుకొని జిల్లా ఉన్నతస్థాయి అధికారుల సూచనల మేరకు ఏదైనా రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తే వాటికి చట్టబద్ధంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాల్సి ఉంటుంది. కాని గిరిజన గ్రామాల్లో కొంతమంది దళారులు నిరక్ష్యరాస్యులను ఎంచుకొని పెద్దెత్తున రిజిస్ట్రేషన్‌ల పేరుతో వారి వద్ద నుండి డబ్బులు వస్తువులు చేస్తున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి మా వద్ద ఇప్పుడు డబ్బులు లేవని అంటే వారికి డబ్బులు ఇచ్చి ప్రాంసరీ నోట్లు రాచుకొని రిజిస్ట్రేషన్లు చేయించారని ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. వైరా సబ్‌రిజిస్టర్ కార్యాలయం అంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది డాక్యుమెంటరీ రైటర్లు దళారులు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఓ అటెండర్ సహాయంతో ఈ దందా అంతా నడుస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఆ అటెండర్ ఎవరు అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వానికి అధికారికి దళారులకు మధ్య ఆయన పాత్ర ఏమిటి. ఆయనను నడిపిస్తున్న అధికారి ఏమి హామీ ఇచ్చింది అనేది కూడా ఇప్పుడు చర్చాంనీయాంశంగా మారింది. అసలు రిజిస్టర్ కార్యాలయంలో ఇప్పటివరకు గడిచిన 3 నెలల్లో ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇటీవల కాలంలో కొణిజర్ల మండలం అమ్మపాలెంలో జరిగిన రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సబ్ రిజిస్టర్‌ను జిల్లా అధికారులు వివరణ అడిగిన సందర్భాలు లేకపోలేదు. ఆ




విషయం మరిచిపోకముందే ఇప్పుడు సబ్ రిజిస్టర్ కార్యాలయానికి అనుసంధానంగా దళారీ వ్యవస్థ ఏర్పడిందని వాదన ప్రజల్లో చక్కెరలు కొడుతుంది. ఏజెన్సీ గ్రామాలను టార్గెట్‌గా ఎంచుకొని కొందరు రిజిస్ట్రేషన్ పర్వంలో పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని ఆరోపణ లేకపోలేదు. ఎవరైనా ఏదైనా అంటే తమకు రాజకీయ పలుకుబడి ఉందని కొంతమంది రాజకీయ నాయకుల పేర్లు వాడుకుంటున్నారని ప్రచారం జరుగుతుంది. డాక్యుమెంటరీ రైటర్లు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలో డాక్యుమెంటరీ రైటర్‌లు ఉండవచ్చునా. అది కార్యాలయం అని చెప్పాలా డాక్యుమెంటరీ కార్యాలయం చెప్పాలనేది కూడా అర్థం కాని పరిస్థితి. విచిత్రం ఏమిటంటే రిజిస్టర్ కార్యాలయంలో ఇటీవల కాలంలో పుట్టగొడుగుల్లా డాక్యుమెంటరీ రైటర్లు పుట్టకొచ్చారు. కొందరు సంపాదనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుతారన్నారు అనే వాదనలు లేకపోలేదు. అసలు రిజిస్టర్ ఇంత పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు అన్ని చూడకుండా ఏ విధంగా చేస్తున్నారు. జిల్లా రిజిస్టర్ వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇప్పటి వరకు 3 నెలల నుంచి జరిగిన రిజిస్ట్రేషన్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

# తల్లిని చంపిన కసాయి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆస్తి తగాదాల విషయంలో కొడుకు కసాయిగా మారి విచక్షణారహితంగా తల్లిపై దాడి చేసి హత్య చేసిన ఘటన ఖమ్మం నగరంలోని రామన్నపేట కాలనీలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు వివరాల ప్రకారం... రామన్నపేట కాలనీకి చెందిన గౌరిపెద్ది శ్రావణ్‌కుమార్ శర్మ గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో పురోహితం చేస్తున్నాడు. శ్రావణ్‌కుమార్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఇంటి ఆస్తి తగాదాకు సంబంధించి దివ్యాంగురాలైన తల్లి గౌరిపెద్ది రామలక్ష్మి అలియాస్ మీరాబి(52) తో తన మాట వినడం లేదని ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కర్ర తీసుకుని విచక్షణా రహితంగా రామలక్ష్మిని కొట్టి పారిపోయాడు. భర్త హరికుమార్ ఇంటికి వచ్చి చూడగా భార్య విఘతజీవిగా పడి ఉంది. సమాచారం అందుకున్న ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, సిఐ ఘటన స్థలంకు చేరుకుని హత్యకు సంబంధించి వివరాలు సేకరించారు. దీనికి సంబంధించి కుమార్తె షేక్ షాహిదా అలియాస్ రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఖానాపురం హవేలీ సిఐ తెలిపారు. శ్రావణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# హోలీ.. సంబురాల కేళీ

**(మొదటిపేజీ తరువాయి)**

అనుగుణంగా పిల్లలు,పెద్దలు, మహిళలు సైతం ఈ వేడుకలో పాల్గొంటున్నారు.

**సహజరంగులే మేలు...**

హోలీ జరుపుకునేందుకు సహజ రంగులు వాడటం మేలని వైద్యులు తెలుపుతున్నారు. రసాయన రంగులను వాడటం ద్వారా పలు రకాల చర్మవ్యాధులతో పాటు ఇతర రోగాలు సంభవించే ప్రమాదం ఉందని అంటున్నారు. కిడ్నీ సమస్యలు కంటి సమస్యలతో పాటు ఇతర రసాయన రంగులు ద్వారా క్యాన్సర్ వంటి జబ్బులు సోకే అవకాశం లేకపోలేదని సూచిస్తున్నారు. సహజ సిద్ధమైన రంగులను తయారు చేసుకుని హోలీ జరుపుకోవడం చాలా మంచిదని సూచిస్తున్నారు.

**సహజ రంగుల తయారీ...**

సహజ రంగును మోదుకు పువ్వు ద్వారా తయారు చేసుకోవచ్చు. వేసవి కాలంలో మోదుగు పూలు పెద్ద ఎత్తున లభ్యమవుతుంటాయి. దీనితో తయారు చేసిన రంగుతో హోలీ జరుపుకోవచ్చు. జామాయిల్ ఆకులు ఉడికించడం ద్వారా ఎరుపు, పసుపు రంగులు తయారు అవుతాయి. బీట్ రూట్ ముక్కలను నీటిలో మరుగపెడితే ఎరుపు రంగు వస్తుంది. గూలాబీ రేకులను నానపెడ్డి కూడా అనేక రంగులను తయారు చేసుకోవచ్చు. ఇలాంటి సహజ సిద్ధమైన రంగులను వాడటం ద్వారా ఆరోగ్యాలను పదిలంగా ఉంచుకోవచ్చుని వైద్య నిపుణులు తెలుపుతున్నారు.

# సిటీ పోలీస్ యాక్ట్ ఆంక్షలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** హోలీ సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ ఆంక్షలు విధించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ రోజున రోడ్లపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన, బైకులపై తిరుగుతూ ఇతరులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తప్పవని సిపి తెలిపారు. వాహనాలపై గుంపులు గుంపులుగా ప్రయాణం చేయవద్దని అలా ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరికి ఇబ్బందులు కలుగకుండా హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పలు జాగ్రత్తలు తీసుకోవాలని సిపి సూచించారు. రోడ్లపై పరిచయం లేని వ్యక్తులపై రంగులు చల్లడం, ప్రయాణికులపై, వాహనాలపై వెళ్లే వారి పైన వారి అనుమతి లేకుండా బలవంతంగా రంగులు చల్లరాదని సిపి తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ఉండటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని సిపి తెలిపారు.

**మద్యం దుకాణాలు, బార్లు బంద్....**

హోలీ పండుగ నేపథ్యంలో మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలని సిపి సునీల్ దత్ తెలిపారు. ఈనెల 25న హోలీ పండుగను పురస్కరించుకుని సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి మంగళవారం ఉదయం ఆరు గంటల వరకు వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాలను 24 గంటల పాటు మూసివేయాలని సిపి సూచించారు.

## బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భగత్‌సింగ్ స్ఫూర్తితో బిజెపి ప్రభుత్వం ఫాసిస్టు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండలం రాంక్యాతండా గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న క్రీడలు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో పోటు రంగారావు హాజరై మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ పోరాడిన పోరాట స్ఫూర్తిని వారసత్వంగా పుణికిపుచ్చుకుని నేడు మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మోడీ ప్రభుత్వం మతాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకుని ఓట్లు దండుకోవాలని చూస్తుందన్నారు. మత ప్రాతిపదికన ప్రజలను విడదీసి దేవున్ని, గుడిని దానికి ఒక సాధనంగా ఉపయోగించుకోవడం రాజ్యాంగ విరుద్ధమైందని దీనిని ఎన్నికల కమిషన్ సైతం అడ్డుకోలేకపోవడం శోచనీయమన్నారు బిజెపి అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో దేశంలో మైనార్టీలపై హింసా, దౌర్జన్యాలు, దాడులు మరింత పెరిగాయన్నారు. మోడీ ప్రభుత్వం రాముని పేరుతో రాజకీయం కొనసాగిస్తుందని ఆలయ నిర్మాణం పూర్తి కాకుండానే హడావుడిగా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పూర్తి చేశారన్నారు. ఎన్నికల వరకు ఆ వాడి వేడి తగ్గకుండా ఉండేందుకు ప్రత్యేకంగా అయోధ్యకు 200 రైళ్లను కేటాయించారని, 66 పట్టణాల నుండి బయలు దేరే విధంగా 100 రోజుల ప్రణాళికలు రూపొందించి ఎన్నికలు జరిగే వరకు వాటిని కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలపై బిజెపి ప్రభుత్వ వ్యతిరేకతను దృష్టి మళ్లించడం కోసం ఈ తంతు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అనేక వాగ్దానాలను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. బిజెపి మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు జి. రామయ్య, ఆవుల అశోక్, సిహెచ్ శిరోమణి, టి. ఝాన్సీ, కె. శ్రీనివాస్, దేవ్లా, కె. లక్ష్మణ్, దరావత్ లక్ష్మణ్, కె. పాపారావు, రాకేష్, ప్రేమ్‌సింగ్, ఇస్లావత్ స్వాతి, రమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు జెవిడి సంస్థ అధినేత కుంచపు రాంబాబు, సైదులు బహుమతులను అందజేశారు. తొలుత గ్రామంలో డప్పు దళాలు, కోలాట బృందాలతో ప్రదర్శన నిర్వహించి భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## భద్రాచలానికి కాలినడకన బయలుదేరిన శ్రీరామ భక్తులు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** శ్రీరామనవమి కళ్యాణానికి ఎంతో భక్తి శ్రద్ధలతో నెల రోజులపాటు గోటితో వలిచిన తలంబ్రాలను కాలినడకన భద్రాచలానికై ఆదివారం బయలుదేరారు. సుజాతనగర్ మండలంలోని కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో నెల రోజుల నుండి సుజాతనగర్ భక్త బృందం ప్రతిరోజు తలంబ్రాల వడ్లను గోటితో వలిచి తమ భక్తిని చాటుకున్నారు. సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ, కోమటపల్లి, నిమ్మలగూడెం, గరీబ్ పేట, కొత్త అంజనాపురం, పాత అంజినాపురం, చీమన్న తండా, నరసింహ సాగర్, సర్వారం వివిధ గ్రామాల నుండి శ్రీరామ భక్తులు జైశ్రీరామ్, శ్రీరామ జయరామ, జయజయరామ అంటూ జైశ్రీరామ్ జెండాలను చేతబట్టి, ఐడి కార్డులను మెడలో ధరించి తమ గ్రామంలోని దేవాలయాలలో దర్శించుకుని కాలినడకన ఎర్రని ఎండలను సైతం లెక్కచేయకుండా భద్రాచలంలోని రామాలయానికి బయలుదేరారు. భక్తులకు సైతం ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో కొన్నిచోట్ల మంచినీళ్లను భోజన ఏర్పాట్లు చేశారు. సుజాతనగర్ మండలం తో పాటు జూలూరుపాడు మండలం నుండి భక్తులు కూడా కాలినడకన భద్రాచలానికి బయలుదేరుతున్నారు.

## నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తాం




**ప్రజాపక్షం/ మధిర :** నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్ లేకుండా నడిపే వాహనాలను సీజ్ చేస్తామని మధిర టౌన్ ఎస్సై సంధ్య హెచ్చరించారు. ఖమ్మం పోలీస్ కమీషనర్ ఆదేశాల్లో భాగంగా ఆదివారం మధిర పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలను టౌన్ ఎస్సై సంధ్య తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్రవాహనాలను అదుపులోకి తీసుకుని చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం తప్పనిసరిగా నెంబర్ ప్లేట్ ఉండాలని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలు ఉండాలి, హెల్మెట్ ధరించి వాహనాలపై ప్రయాణించాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన కేసులు నమోదు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

## బిఆర్‌ఎస్‌ను వీడనున్న మాజీ వైస్‌చైర్మన్ ధూపాటి..?



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ పట్టణానికి చెందిన ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు గత కొన్నిరోజులుగా బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనపడని పరిస్థితి ఉంది. అయితే బిఆర్ఎస్ పార్టీని విడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత 30 సంవత్సరాల నుండి మొదటి నుండి టిడిపిలో ఉండి 2001లో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్‌గా గెలిచి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 2009 నుండి సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వచ్చినప్పటి నుండి వారి ముఖ్య అనుచరుడుగా గత 15సంవత్సరాలుగా ఉన్నారు. రెండు పర్యాయాలు టిడిపి మండల అధ్యక్షలుగా ధూపాటి భద్రరాజు ఉన్నారు. గతంలో సత్తుపల్లి నియోజకవర్గంలో మూడు సార్లు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం కృషి చేయడం జరిగింది. ఆతర్వాత టిడిపి నుండి బిఆర్ఎస్ పార్టీలోకి సండ్రతోనే పార్టీ మారటం జరిగింది. 2018 నుండి 2023 వరకు వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌గా మూడు సార్లు పదవిలో ఐదు సంవత్సరాల వరకు కొనసాగారు. ఒక బిసి నాయకుడిగా తల్లాడ పట్టణం, మండలంలోనే అందరితో పరిచయం ఉన్న నిబద్ధత, అనుభవం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. తల్లాడ మండలంలో ఈయనతో పాటు మరికొంతమంది పార్టీ మారనున్నట్లు సమాచారం. మండలంలో ఏమి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

## ఉత్తమ అవార్డుల అందజేత




**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తల్లాడ మండలంలో ఉత్తమ సేవలందించిన అధికారులకు అవార్డులను అందచేశారు. తల్లాడ ట్రిట్మెంట్ యూనిట్ నందు మెరుగైన సేవలందించిన ల్యాబ్ టెక్నిషియన్ ధనకొండ కృష్ణారావు, కుర్నవల్లి ఆరోగ్య మందిరం నుండి ఎఎన్ఎం ఆర్.సునీతలు డిఎంఅండ్‌హెచ్ఓ మాలత, టిబి నిర్మూలన అధికారి డాక్టర్ సుబ్బారావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రత్నమనోహర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, టిబి సూపర్‌వైజర్ వై.సురేష్, ఇతర సిబ్బంది ఉత్తమ అవార్డుల అందుకున్నవారిని అభినందించారు.

## లంకా కొండయ్యకు ఉత్తమ సేవా పురస్కారం అందజేత




**ప్రజాపక్షం/ మధిర :** ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా క్షయ నిర్మూలన కేంద్రం వద్ద జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ మాలతి, జిల్లా టిబి నిర్మూలన ప్రోగ్రాం అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దెందుకూరు ఆరోగ్య పర్యవేక్షకులు లంకా కొండయ్య టిబి కేసులు, మోటివేషన్, టిబి రోగులకు చికిత్స విధానాన్ని తెలుపుతూ జన సమూహంలో విస్తృత ప్రచారం చేస్తూ ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది, పలువురు లంకా కొండయ్యకు అభినందనలు తెలిపారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షల్లో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పదవ తరగతి గణిత పరీక్ష సమయంలో కూసుమంచి మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా 144 సెక్షన్ విధించినను పరీక్షా కేంద్రం వద్ద తిరుగుతూ పరీక్ష నిర్వహణలో ఆటంకాలు కలిగించిన వారిపై కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. కూసుమంచి పరీక్షా కేంద్రం వద్ద తేజావత్ రిషి అరవింద్, బానోత్ మంగులాల్, రెడ్డిమళ్ల గణేష్, రెడ్డిమళ్ల ధనుష్, ఇంతియాజ్ అహ్మద్, ఎండి అర్షద్ అహ్మద్, కోక్కిరేణి సీతారాములు పరీక్ష నిర్వహణకు ఆటకం కలిగించారని పరీక్షా కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు డిఈవో తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఉల్లంఘన, తెలంగాణ పబ్లిక్ పరీక్షల యాక్ట్ 25 అఫ్ 1997లో సూచించిన విధంగా మాల్ ప్రాక్టీస్, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని డిఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా మ్రాను కొమ్మల ఆదివారం





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఆర్ సి ఎం చర్చి పెద్ద కోరుకొండిలోని ఆర్ సి ఎం చర్చితో పాటు పలు సి ఎస్ ఐ చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులు పుర వీధులలో కొబ్బరి మట్టలు, ఈత కొమ్మలు పట్టుకొని యూదుల రాజాకు జయం జయం హోసన్నా హోసన్నా అంటూ ప్రత్యేక పాటలతో, బైబిల్ వాక్యాలతో, పురవీధులలో ర్యాలీలు ప్రదర్శనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. మత గురువులు జోజిబాబు, సురేష్ జోష్, ఆనంద్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, వెంకటాపురం, చెన్నూరు, ఎర్రబోయినపల్లి , లింగాల, పేరువంచ, కప్పల బంధం, పుల్లయ్య బంజర, చంద్రుపట్ల, తదితర గ్రామాల క్రైస్తవులు, సంఘ పెద్దలు, సంఘస్తులు, కన్యస్త్రీలు, ఉపదేశకులు, దీక్ష సోదరులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి




**ప్రజాపక్షం/కల్లూరు:** హోలీ పండుగను మండల ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కల్లూరు ఎస్సై షేక్ షాకీర్ తెలిపారు. హోలీ రోజున రోడ్లపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తూ బైకులపై తిరుగుతూ, ఇతరులకు ఇబ్బంది పెడితే వాహనాలపై గుంపులు గుంపులుగా ప్రయాణించవద్దని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రశాంతమైన వాతావరణంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా హోలీ పండుగను జరుపుకోవాలని, అదే విధంగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై పరిచయం లేని వ్యక్తులపై రంగులు చల్లటం, ప్రయాణికులపై వాహనాలపై వెళ్లే వారి పైన వారి అనుమతి లేకుండా బలవంతంగా రంగులు చల్లరాదని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ఉండాలని లేనిచో ఎవరినైనా ఎలాంటి వారినైనా వదిలేది లేదని హెచ్చరించారు. ఈ నెల 25 సోమవారం నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మద్యం, కల్లు దుకాణాలు, మూసివేసి ఉంటాయని కావున ప్రజలందరూ హోలీ ఆంక్షలు అమలుకు సహకరించాలని కల్లూరు ఎస్సై ప్రజలను కోరారు.

## లోక్‌సభ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టండి





**ప్రజాపక్షం/కల్లూరు:** త్వరలో జరగబోయే లోకసభ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, మోహన్ రావు, శేషగిరిరావు, ఏనుగు సత్యం బాబు, కే వెంకటేశ్వర్లు కార్యకర్తలను కోరారు. ఆదివారం కల్లూరులోని డి ఎన్ పి ఫంక్షన్ హాల్లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికలలో కార్యకర్తలు నాయకులు ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో బూతు స్థాయి కమిటీలకు ప్రత్యేక స్థానం ఉంటుందని పనితీరును బట్టి ఇందిరమ్మ కమిటీలలో ప్రత్యేక స్థానం ఇవ్వడం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. మండలంలో కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలియడంతో వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు స్థానిక ఎమ్మెల్యే కు తెలియకుండా రానివ్వబోమని గతంలో వారు మాకు ఎన్నో అడ్డంకులు పెట్టారని చేశారని, వారిని వద్దని అదే విధంగా ఇతర పార్టీల కార్యకర్తలు రావచ్చని వారు సందర్భంగా పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీలలో పనితీరును బట్టి చురుకైన కార్యకర్తలను ఇందిరమ్మ కమిటీలలో నియామకం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. కష్టపడి పార్టీకి గుర్తింపు తెచ్చిన వారికి పార్టీలో ప్రయారిటీ ఉంటుందని నాయకులు వివరించారు. త్వరలో నియోజకవర్గం మండలం సమన్వయ కమిటీలు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రముఖులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మనోధైర్యంతో లక్ష్యాలు సాధించాలి

### స్పెషల్ బ్రాంచ్ ఏసిపి వెంకటేష్







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రణాళిక, మనో ధైర్యంతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునని స్పెషల్ బ్రాంచ్ ఏసిపి ఎన్. వెంకటేష్ తెలిపారు. ఆదివారం కాకతీయ యూనివర్సిటీ పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చేకూరి రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెషల్ బ్రాంచ్ ఏసిపి వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ వ్యాయామ విద్యతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. క్రమశిక్షణ, మానసిక ఉల్లాసానికి వ్యాయామ విద్య ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల వద్ద మేళకువలు నేర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు గుర్తింపు తేవాలన్నారు. తాను వ్యాయామ విద్యను అభ్యసించి ఉపాధి పొంది ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానని ఏసిపి తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగి అనుకున్న రంగాలలో రాణించాలని వారికి మనో ధైర్యాన్ని నింపారు. డ్రగ్స్, తదితర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉత్తమ మార్గాలను ఎంచుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో తమ కంటూ ఒక ప్రత్యేక స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. పేద, వెనక బడిన విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. సర్దార్ పటేల్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ ఎండి గౌస్ మాట్లాడుతూ వ్యాయామ విద్య పూర్తి చేసిన ఎంతో మంది విద్యార్థులు నేడు సమాజంలో కీలకంగా ఉన్న ఆర్మీ, పోలీస్ తదితర శాఖల్లో ఉపాధి పొంది ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని నేటి విద్యార్థులు భవిష్యత్తులో ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు.ఈ సందర్భంగా ఏసిపి వెంకటేష్‌ను ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు శాలువతో సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మధు, కోటి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కనువిందు చేస్తున్న మోదుగు పువ్వులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల, చెన్నూరు గ్రామాలలో రోడ్డు ఇరువైపులా ఉన్న మోదుగ చెట్లు పువ్వులు ఆహ్లాదకరంగా చూడటానికి చూడతరమా అంటూ కనువిందు చేస్తున్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా వేసిన ఈ మోదుగ మొక్కలు చెట్లు అయ్యి పువ్వులు కనువిందు చేస్తున్నాయి. హోలీ పండుగ వచ్చిందంటే గుర్తుకొచ్చేది మోదుగ పువ్వుల అందాలు. ఈ రహదారి వెంబడి వేసిన హరితహారం మొక్కలు చెట్లు గా మారి పువ్వులు పూసి ఆహ్లాదకరంగా ప్రకృతి ప్రేమికులకు ఆస్వాదకరంగా మారాయి. వీటి వెంట కొందరు యువతీ యువకులు సెల్ఫీలు తీసుకుని సెల్ ఫోన్లలో సేవ్ చేసుకుంటున్నారు. ఈ మోదుగ చెట్టు వెంబడి వేరే చెట్లు కూడా ఇదే అదునులో పూలు పూస్తూ ఈ రహదారి ఆహ్లాదకరంగా మారింది. పువ్వులు ఫుల్ ఆకులు నిల్ గా ఉండటంతో ఇంకా ఆకర్షణగా ఉంది. ఈ చెట్లు ఎక్కువగా పొలాల గట్లు చెరువుగట్లు పై ఎక్కువగా వేస్తారు. కానీ హరితహారం లో భాగంగా వీటిని రోడ్డు ఇరువైపులా అక్కడక్కడ నాటి పెంచడంతో ఇవి ఆహ్లాదకరంగా మారింది. నీడనిచ్చే చెట్లు తో పాటు పువ్వులు నిచ్చే చెట్లు పెంచడం పట్ల ఈ రహదారి హరితహారం ఆహ్లాదకరంగా భరితంగా మారింది. కల్లూరు నుంచి మధిర రహదారిలో చిన్న కోరుకొండి వరకు 18 కిలోమీటర్ల మేర ఆహ్లాదకరంగా ప్రకృతి ప్రేమికులకు ఆనందంగా మంచి వాతావరణాన్ని ఇస్తూ ఆనంద పరుస్తుంది ఈ రహదారి.

## భక్తుల కొంగు బంగారం.. సంతాన వేణుగోపాలస్వామి

### -నేటి హోలీ రోజు స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం
### -ముస్తాబైన ఆలయం





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భక్తుల కొంగు బంగారమైన శ్రీరుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి తిరుకళ్యాణ మహోత్సవాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది హోలీ పండుగ రోజున స్వామికి కళ్యాణాన్ని చేపడ్తారు. భద్రాద్రి క్షేత్రానికి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఇరవెండి(విరివెండి) గ్రామంలో శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి తిరుకళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. గ్రామానికి కిలో మీటర్ దూరంలోని గుట్టపై ఉన్న వేణుగోపాలస్వామి ఆలయం 1400 ఏండ్ల క్రిందట చోళులు, గణపతిరాజుల మధ్యకాలంలో వెలసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. నాడు చోళ రాజులు భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పూజా కార్యక్రమాలు, కళ్యాణాలు నిర్వహించే వారు. పూజాల్లో భాగంగా స్వామివారికి విరిసిన వెండి పుష్పాలతో పూజలు చేయడంతో ఈ గ్రామం విరివెండిగా ఏర్పడింది. కాలా క్రమేనా ఇరవెండిగా పేరు సంతరించుకొంది. అప్పట్లో దేవాలయాల ఆలయ ఆలానా పాలనా రాజుల ఏటుబడిలో ఉండటం వల్ల పూజా కార్యక్రమాలు బాగా జరిగేవి, ఆనాటి నుండి ప్రతి హోలీ పర్వదినాన్న ఆ ఆలయంలో స్వామి వారికి తిరుకళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 25న జరిగే స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అభిజత్ లగ్నంలో 12గంటల 06 నిమిషాలకు స్వామి వారికి కళ్యాణం నిర్వహిస్తారు.

**కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి.......దేవస్థానం కమిటీ సభ్యులు వల్లూరిపల్లి వంశీకృష్ణ**

సంతాన వేణుగోపాల స్వామి కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కమిటీ సభ్యులు వల్లూరిపల్లి వంశీకృష్ణ అన్నారు. ఉదయం నాలుగు గంటలకు మేల్కోల్పు సేవలు, ఐదు గంటలకు అభిషేకం, ఆరుగంటలకు ఆర్జిత సేవలు, బాలబోగం, ఏడు గంటలకు యాగశాలలో పూజలు, ఆంకురార్పన కార్యక్రమాలు నిర్వహిచన్నట్లు తెలిపారు. తొమ్మిది గంటల నుంచి పది గంటల వరకు డోలారోహణము, 10 నుండి 10:30 గంటల వరకు ధ్వజారోహణము, గరుడ ముద్దలు, 10:30 నుండి 11గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవాలు నిర్వహించిన అనంతరం కళ్యాణ మహోత్సవ నిర్వహించున్నట్లు పేర్కొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అడుగంటిన గంగ.. రైతుల బెంగ..!

### -పశువులకు మేతగా మారిన వరి
### -ఒక్క తడి నీరందితే పంట చేతికొచ్చే..







**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** లక్షల రూపాయలు వెచ్చించి అందినకాడి కల్లా అప్పులు తెచ్చి వ్యవసాయం సాగు చేసిన రైతులకు చివరకు అప్పులే మిగిలాయి.బావులలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఎకరం పోలం తడవాలంటే మూడు రోజులు పడుతుంది. మునుపెన్నడూ లేని విధంగా పాతాళగంగ అడుగంటిపోయింది. ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలు యాసంగిలో సాగు చేశారు. అందులో సగం వరకు సాగు నీరు లేక ఎండిపోతున్నాయి. వచ్చిన కొద్ధిపాటి పంట విక్రయించాలంటే కేంద్రాలు లేవు. ఇటు ప్రకృతి వలన...అటు దళారులు వలన కూడ రైతులే బలి అవుతున్నారు. లక్షల ఎకరాలు నీళ్లు లేక నోళ్లు తెరుస్తున్నాయి. మరి కొన్ని వేలాది ఎకరాలు వరి పంట బిర్రు పొట్ట మీద ఉన్నాయి. వీటికి ఒక్క తడి నీరందితే చాలా వరకు ప్రయోజనం కలుగుతుంది.

**రైతులు విసుగుచెంది....పశువులకు మేతగా....**

సాగు నీటి కోసం ఎదురు చూసి విసుగు చెంది చివరకు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారు. వచ్చిన పంట ఎకరానికి 15 బస్తాలు కూడ దిగుబడి రావటం లేదు. ఇక కౌలు రైతు పరిస్తితి దారుణంగా ఉంది. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, కూసుమంచి, ఖమ్మం రూరల్, రఘునాధపాలెం, వైరా, చింతకాని, బోనకల్ తదితర మండలాలలో వరి సాగు విస్తీరణం యాసంగి లో చాలా వరకు తగ్గించారు. సాగు చేసిన వాటిలో సగం వరకు పశువులకు మేతగా ఇస్తున్నారు.

**ఒక్కతడి నీటిని అందిస్తే చాలు...**
**కాశిబోయిన అయోధ్య, నేలకొండపల్లి , రైతు.**



ప్రస్తుతం ఉన్న పరిస్తితులలో ఒక్క తడి నీరు వరిసాగు కు అందిస్తే చాలు రైతులకు ఊరట కలుగుతుంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఉన్నాం. ఒక పక్క వాతావరణంలో మార్పులతో భయంతో ఉన్నాం. మరో పక్క బిర్రు పొట్టమీద ఉన్న పంట చేతికి వస్తుందా లేదా అని ఆందోళనగా ఉంది.

**కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.**
**ఆనం వెంకటరెడ్డి, అనంతనగర్.రైతు.**



రైతులకు నష్టం జరగకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. మద్దతు ధర ద్వారా కనీసం కొంతైనా ప్రయోజనం ఉంటుంది. లేకుంటే దళారులు వలన రైతులు అప్పులు పాలు కావాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. రైతులు పరిస్థితి ని అర్ధం చేసుకోవాలి.

**రైతుల కు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశా....**
**భూషయ్య, ఆరెగూడెం, రైతు.**



యాసంగి రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశా ఉంది. గత పాలకుల కంటే ఈ ప్రభుత్వం రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. కొనుగోలు కేంద్రాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతులు తొందరపడకుండా కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా కార్యచరణ ను చేసుకోవాలి.

# బ్రహ్మాండనాయకుని కళ్యాణ మహోత్సవానికి తరలిరండి

### -నేడు తిరుకళ్యాణ మహోత్సవం
### -బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన అన్నపురెడ్డిపల్లి శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయం







**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నటువంటి 18వ శతాబ్దము కాలము నాటి అతి పురాతనమైన చరిత్ర కలిగిన కాకతీయ రాజుల శిల్పకళా వైభవంతో నిర్మించబడినటువంటి దేవాలయము నందు కొలువై ఉన్న భక్తుల కొంగుబంగారమై , సంతాన బాలాజీగా పూజలందుకుంటున్న శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని తిరుకళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నేడే జరుగుతుంది. ఈ కళ్యాణ వేడుకకు ఆలయ ప్రాంగణం మొత్తం సర్వాంగసుందరంగా విద్యుత్ దీపాలంకరణలతో సుగంధ పరిమళ పూలమాలలతో ఎంతో మనోహరంగా సిద్ధమైంది. ఈ బ్రహ్మోత్సవములు స్వస్తి శ్రీ చాంద్రమానేన శుభ కృత నామ సంవత్సర పాల్గుణ శుద్ధ సోమవారం 23 మార్చి 2024 నుంచి ప్రారంభమై పాల్గొన్న బహుళ తదియ శుక్రవారం 28 మార్చి 2024 వరకు వేద పురాణాది పారాయణ దులతో శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మంగళవారం సాయం కాలం ఐదు గంటల నుంచి 10గంటల వరకు ఆరాధన, చతుస్టానార్చన, నిత్య హవనము, పూర్ణాహుతి, బలిహరణము, గజ వాహన సేవ, పల్లకి సేవ, ఎదుర్కోల ఉత్సవము నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణం లోని కళ్యాణ మండపము నందు ప్రధాన అర్చకులు ప్రసాద ఆచార్యులు ఆధ్వర్యంలో ఆగమన పండితుల సారథ్యంలో స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుంది. కనుక ప్రజలందరూ కూడా బ్రహ్మాండనాయకుని కళ్యాణ మహోత్సవమును కన్నులారా దర్శించుటకు విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందగలరని , బ్రహ్మోత్సవాలు జరిగే ఈ ఐదు రోజులు కూడా సాయంకాల సమయంలో భక్తి పరమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబతాయని ఆలయ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. అన్నపురెడ్డిపల్లి పరిసర ప్రాంతాల నుంచి కొత్తగూడెం, సత్తుపల్లి ఆర్టీసీ బస్ డిపో నుంచి బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏ విధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మంచినీరు. అన్నదానం కార్యక్రమాలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు కలుగకుండా వైద్య ఆరోగ్య శాఖ వారి ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామి వారి ప్రసాదాలను ప్రత్యేక కౌంటర్లలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ, రెవిన్యూ శాఖ, శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేస్తారని, ప్రజలందరూ కూడా ఈవిషయాలను గమనించి స్వామివారి కళ్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో హాజరై ఈ జాతరను విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు : జెడ్‌పిటిసి శ్రీలత




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు బూర్గంపాడు మండల జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హోలీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి అనేది రంగులతో సింగారించునే సమయం అదే వసంతోత్సవం హోలీ పర్వదినమని, హోలీ మన జీవితాలలో ఆనంద పరిమళాలను సుఖ సంతోషాల శాంతి సౌభాగ్య విజయాలను నింపాలని మనసారా కోరుతున్నట్లు తెలిపారు. హోలీ రంగుల వేదజల్లక అని సహజ సిద్ధం రంగులను వాడుతూ అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తూ పిల్ల పాపలతో కుటుంబ సమేతంగా సంతోషాలతో హోలీ పండుగను జరుపుకోవాలని సూచించారు.

## వలస ఆదివాసీ గూడాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కరకగూడెం:** మండలంలో వలస ఆదివాసి గూడాల్లో త్రాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మడివి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రేగళ్ల గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వేసవి కాలం రీత్యా త్రాగునీటి కోసం ప్రజలు హరిగోశ పడతున్న అధికారులు నిధులు లేదనే కారణంతో సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యం చెందుతున్నారని, నీటి కోసం వాగులు, వంకలు, చెరువుల కోసం చూస్తున్నారని ఆ నీటిని త్రాగుతున్నారని తెలిపారు. అయినా అధికారులు మాత్రం ఆరకోర పనులతో నీటి సౌకర్యం కల్పిస్తున్నామని చేతులు దులుపుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారని వారన్నారు. మిషన్ భగీరథ పనులు ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో చేయలేదని వలస ఆదివాసి గూడాలలో ఇంటింటికి నల్ల మిషన్ భగీరథలో భాగంగా ఎక్కడా ఏర్పాటు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి పర్యటించి త్రాగునీటి ఎద్దడిని నివారించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు కనితి రాజు, మడకం చందు, పదం సత్యం, మడివి లక్ష్మయ్య, వజ్జ రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** విజయ నర్సింగ్ హోమ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఆళ్లపల్లి మండల కేంద్రంలోని జెడ్‌పిఎస్ఎస్ స్కూల్లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ విజయ లక్ష్మి ఎంబిబిఎస్, డిజివో మాట్లాడుతూ పేద ప్రజలు అందరూ హాస్పటల్‌కి రాలేకపోవడంతో మేమే గ్రామీణ ప్రాంతాలకు వచ్చి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఈ ఉచిత వైద్య శిబిరాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకున్నారని, ఉచిత వైద్యంతో పాటు కొన్ని మందులు కూడా పంపిణీ చేశామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్యాం కుమార్, డాక్టర్ శంకర్‌రావు, వ్యాపారస్తులు అబ్బు నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, కోఆపరేటివ్ డైరెక్టర్ సయ్యద్ హఫీజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ అతహార్, గ్రామీణ వైద్యులు ఎండి ఖాలీద్, సిరినోముల నరేష్, యాసారపు కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## గోటి తలంబ్రాలతో భద్రాచలం వరకు పాదయాత్ర



**ప్రజాపక్షం/పినపాక:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి నవమి కల్యాణానికి గాను పినపాక మండలం చింతల బయ్యారం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం నుండి గోటితో ఒలిచిన గోటి తలంబ్రాలు తీసుకుని ఆదివారం పాదయాత్రగా భక్త జనం బయలుదేరారు. ప్రతీ ఏటా గోటి తలంబ్రాలు వలిచి భద్రాచలం వరకు పాదయాత్రగా వెళ్లి దేవస్థానంలో అందిస్తామని తెలిపారు. జైశ్రీరామ్ నినాదాలు చేస్తూ తలపై తలంబ్రాలు పెట్టుకొని మండుటెండను సైతం లెక్కచేయకుండా భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గుమ్మల నారాయణమ్మ, గుమ్మల పద్మ, పార్వతమ్మ, పొనగంటి రాణి, మంచర్ల రామారావు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాలు



**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన భారత స్వాతంత్రోద్యమ యోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమ నిర్మాణం జరగాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి మాజీ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ పేర్కొన్నారు. స్వాతంత్ర ఆకాంక్షను నిలువెల్ల నిలుపుకున్న భగత్‌సింగ్ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలోభగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగిన సభలో శివరామకృష్ణ మాట్లాడుతూ నాడు భగత్‌సింగ్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యాలు అవుతున్నాయని కులం, మతం, స్వార్థ రాజకీయాలకు ఊతగా నిలుస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పసి మెదళ్లలో మతోన్మాదాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తుందని విద్యను కాషాయికరణ చేయడం ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తుందని ఆరోపించారు. మత శక్తులు , కార్పొరేట్ శక్తులు యువతపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని సమాజాన్ని గురించి ఆలోచించడాన్ని తప్పుబడుతూ యువత, విద్యార్థులను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. విద్యార్థులు సమాజం గురించి ఆలోచించి చైతన్యవంతులైతే తమ ఆటలు సాగవన్న పాలకులు రాజకీయ, సామాజిక చైతన్యానికి అడ్డుపడుతున్నారని శివరామకృష్ణ ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులలో మతోన్మాద శక్తులను అడ్డుకోవాలంటే విద్యార్థులను చైతన్యపర్చాలని సమాజ మార్పు కోసం విద్యార్థి ఉద్యమాలు అవసరమన్నారు. కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రోహిత్, ప్రతాప్, రాజు, సునీల్, రాకేష్, నవ్య, ప్రశాంతి, శిల్ప, పావని తదితరులు పాల్గొన్నారు.

# ఖాదర్‌కు డాక్టరేట్ పురస్కారం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన నన్నేసాహెబ్‌ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, కేకే ఇన్ఫ్రా అధినేత , కేపీఎస్‌జీ గ్రూప్ సభ్యులు ఖాదర్‌కు ఆదివారం డాక్టరేట్ పురస్కారం లభించింది. తమ సంస్థల ద్వారా పేదలకు అండగా సామాజిక సేవలు చేస్తున్న సేవలను గుర్తించి ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రిసర్చ్ యూనివర్శిటి వారు డాక్టరేట్ పట్టాను బహుకరించారు. దీనిని హైదరాబాద్‌లోని ఏషియకల్చరల్‌సిటీ కన్వేన్షన్‌హాల్‌లో ఫౌండర్ ఆకుల రమేష్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఖలీల్ సోదరులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, ఖాదర్‌ను అభినందించారు. తమ సేవలను గుర్తించి డాక్టరేట్ అందజేయడంపై సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్ మాట్లాడుతూ..తనకు దక్కిన గౌరం తనకు మరింత భాధ్యతను పెంచిందన్నారు.

# ఉర్దూ ఘర్ షాదీఖానాను రక్షించండి



**సిపిఐ నేత సలాం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉర్దూ ఘర్ షాదీఖానా ఒక బూజు బంగ్లాగా మారిందని దానిని గురించి ఎవరు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. అప్పుడప్పుడు ముస్లింలు ఒత్తిడి చేసినప్పుడు పైపై మెరుగులు దిద్ది చేతులు దులుపుకుంటున్నారని ఆయన తెలిపారు. ఆదివారం సిపిఐ బృందం ఉర్దూఘర్ షాదీఖానాను పరిశీలించింది. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ గతంలో కేవలం రెండు శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని ఖమ్మం అర్బన్ తహసీల్దార్ దీనికి ఇంచార్జిగా ఉన్నప్పటికీ ఫలితం లేదన్నారు. ఏడాదికి వచ్చే ఆదాయం ఎంత, ఖర్చు ఎంత అనే దానిపై కనీసం లెక్కలు లేకుండాపోయాయని సలాం ఆరోపించారు. విద్యుత్ సౌకర్యం కూడా షాదీఖానాలో సరిగ్గా లేదని, ముస్లింలకు ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని సలాం తెలిపారు. షాదీఖానాకు వచ్చే ఆదాయం ఎంత, చేసిన ఖర్చు ఎంత తక్షణం బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నూతన షాదీఖానా నిర్మాణం ఎందుకు ఆగిపోయిందో తెలియజేప్పాలన్నారు. సందర్శించిన వారిలో ఎండి రెహ్మాన్, యాకూబ్, ఖిల్లా, ముజామిల్, ఎస్‌కె రెహ్మాన్, అహ్మద్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

# ప్రియదర్శినిలో రంగస్థల శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాపరిధిలో గల ప్రియదర్శిని కళాశాలలో విద్యార్థినిలకు రంగస్థల శిక్షణాతరగతుల శిబిరంను ఆదివారం నిర్వహించారు. ప్రఖ్యాత కవి,ప్రముఖ రంగస్థల దర్శకుడు శ్రీనివాస్ దెంచనాల ఆధ్వర్యంలో 50మంది బీటెక్,డిగ్రీ విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలను,శ్రీనివాస్‌ను కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ అభినందించి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అద్యాపకులు, కళాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలి పండుగ

**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలో గిద్దవారిగూడెం గ్రామపంచాయతీలో ఘనం గా హోలి పండుగ జరుపుకున్నారు. ఆడ, మగ తేడా లేకుండా అందరూ కలిసి రంగులు పూసుకుంటూ హోలి పండుగ జరుపుకున్నారు.

# కాగడాలతో కదం తొక్కిన యువత



**- భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని పురవీధుల్లో ప్రదర్శన**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతి వేడుకలను(ఏఐవైఎఫ్) అఖిలభారత యువజన సమైఖ్య ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన యువత కాగడాలను పట్టుకుని పురవీధుల్లో పదర్శన నిర్వహించారు. ఇంక్విలాబ్ జిందాబాద్,భగత్ సింగ్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాలేరు నియోజకవర్గ ఏఐవైఎఫ్ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడారు..నూనుగు మీసాల పసి ప్రాయంలో దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కేంద్ర,ర్రాష్ట ప్రభుత్వాలు యువత విషయంలో అశ్రద్ధ కనబరుస్తున్నాయన్నారు. వీటిపై యువత పోరాటాలుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ సభ్యులు గణపరపు ఉపేందర్, మండల ఉపాధ్యక్షుడు మేళ్లచెర్వు సాయి, ఏఐటీయూసీ జిల్లా సమతి సభ్యులు శ్రీను, మేళ్లచెర్వు గురవయ్య, యువజన సంఘం నాయకులు వెంపటి రాము, రెబ్బగొండ్ల గోపి, వల్లబోయిన వినోద్, దండి రమేష్, దండి రవి, చిలక నాగరాజు, మామిడాల కిరణ్, పొన్నెకంటి అఖిల్, పొన్నెకంటి చక్రవర్తి, బాలకృష్ణరెడ్డి, బోయిన వెంకటేష్, ఏపూరి చిన్నగోపి, బియ్యాల రాజు, జి.శ్రీహరి, దైథ జేమ్స్, కోటి , పాల్వాయి యోబుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ వైభవం దిశగా కారేపల్లి సంత



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలో సింగరేణి మండల కేంద్రంలో గల వారాంతపు సంత పూర్వ వైభవం దిశగా కొనసాగుతుంది. సుమారు రెండు దశాబ్దాల క్రిందట ఈ సంత ఇసుకేస్తే రాలనంత జనంతో కోలాహలంగా ఉండేది. కొంతకాలం తర్వాత క్రమక్రమంగా తగ్గుతూ కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. తిరిగి మళ్లీ ఇప్పుడు కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తుంది. దీంతో వ్యాపారస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సాగునీటి కాల్వలను పునరుద్ధరించాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో గండగలపాడు సమీపంలో రైతులు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో తమ పంట పొలాలకు సాగునీరు అందించే కాల్వలు ధ్వంసం చేసి వాటి పునరుద్ధరణపై నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారు. దీంతో వందలాది మంది రైతులు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేయడంతో నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఫీల్డ్ చానల్‌తో సహా సాగునీటి కాల్వలు పునరుద్దరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్డాతూ డొంక రోడ్లు ఉన్న ప్రతిచోట అండర్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వందల సంవత్సరాలు ఉండే జాతీయ రహదారి కాబట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు భవిష్యత్తులో తలెత్తకుండా పంట కాల్వలు పునరుద్దరణ చేయాలని అన్నారు. సోమవరం ఎంట్రీ, ఎగ్జిట్ నుంచి సర్వీస్ రోడ్డు గండగలపాడు వరకు పొడిగింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, ఇమ్మడి వీరభద్రం, ఇమ్మడి సుధీర్, మచ్చా సత్యం, పల్లెబోయిన కృష్ణ, కామినేని రవి, చిత్తారు మురళి, పుచ్చకాయల రామయ్య, బొల్లెపోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సిపిఎం జిల్లా నాయకులు ఊరడీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏదులాపురం పంచాయతీ పరిధిలోని తాళ్లేసి తండాలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సామియో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 52మంది రక్తదాతలు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా సామియో వ్యవస్థాపకుడు విజయ్‌రెడ్డి మాట్లాడుతూ...సామియో సంస్థ స్థాపించి మూడు సంవత్సరాలు అవుతందన్నారు. ఈ మూడు సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. దీనికి సహకరిస్తున్న పత్రీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంపూడి కృష్ణ, సామియో సభ్యులు పొన్నెకంటి అనీష్, పొన్నెకంటి నరసింహారావు, గడ్డం వీరబాబు, వేర్పుల జయప్రసాద్ రావు, మామిండ్ల ఉమాకర్, తోట నరేష్‌రెడ్డి, శ్రీకాంత్, పుల్లయ్య, మద్ది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్టోరల్ బాండ్లతో.. బూర్జువ పార్టీల దోపిడీ బయటపడింది..

**- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం, జిల్లా కార్యదర్శి పోటు**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** అధికారంలో ఉన్నప్పుడు కార్పోరేట్ సంస్థలకు,ఇతర అక్రమ మార్గాలకు చేసిన సేవలకు గాను బూర్జ్వాపార్టీలు ఎలక్టోరల్‌బండ్ల రూపేనా విరాళాలను పొందాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ విమర్శించారు. మండలపరిధిలోని ఏదులాపురం గ్రామంలో ఇటీవల దండి భాస్కర్ మెమోరియల్ ట్రస్ట్, సిపిఐ, యువజన సంఘం,మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల బహుమతులను సిపిఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు... మతోన్మాద రాజకీయాలకు పెట్టింది పేరైన బిజేపి ఈ అక్రమ విరాళాలను పొందడంలో అగ్రభాగంలో నిలిచిందని ఆరోపించారు. అటు తర్వాత ఇతర బూర్జువ పార్టీలు ఈ పాపంలో పాలు పంచుకున్నాయన్నారు. ఈ వ్యవహారాన్ని బట్టి చూస్తుంటే దేశ సంపదను, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఎంత దుర్వినియోగం చేశారో ఇట్టే అర్థమవుతందన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ఒక్క రూపాయి విరాళాన్ని సేకరించలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. తమ నిబద్ధతకు ఇది ఒక తార్కాణంగా నిలిచిందని, ప్రజల పక్షాన తమ వైఖరేంటో తేటతెల్లం చేసిందన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ...ఏదులాపురం అభివృద్ధి సిపిఐ పార్టీతోనే సాధ్యమైందన్నారు. పేద ప్రజల ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోసం పోరాటం చేసిం సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ నాయకులు మిడకంటి పెద్ద వెంకట్ రెడ్డి, దండి రంగారావు, వెన్నం భాస్కర్, వెంపటి సురేందర్, దొంతగాని వెంకన్న, వెంపటి రాము, మేళ్లచెర్వు రవి, మేళ్లచెర్వు వెంకన్న, మేళ్లచెర్వు గురవయ్య, ్ధరవయ్య శ్రీను, పొన్నెకంటి చక్రవర్తి, యువజన సంఘం నాయకులు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, ఘనపరపు ఉపేందర్, వల్లెబోయిన వినోద్, పొన్నెకంటి అఖిల్ తదితరలు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలతో అందరికి లబ్ధి

**-వచ్చే హోలీ నాటికి ఇందిరమ్మ కొత్త ఇండ్లు**

**-కాంగ్రెస్ నేత ప్రసాదరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలతో లబ్ధి చేకూరనుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాదరెడ్డి తెలిపారు. వచ్చే హోలీ నాటికి పేదలంతా ఇందిరమ్మ కొత్త ఇండ్లలో ఉంటారని ఆయన తెలిపారు. ఆదివారం కూసుమంచి లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో గిరిజన మహిళలు, నాయకులతో కలిసి ముందస్తుగా హోలీ పండుగను జరుపుకున్నారు. ప్రసాదరెడ్డి సతీమణి లక్ష్మి తో కలిసి తండాల నుంచి వచ్చిన మహిళలు హోలీ విశేషాలను చెబుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ అందించనుందన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలు ప్రారంభమయ్యాయని వాటి కొందరు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రాధాన్యత ప్రకారం అందరికి లబ్ధి చేకూరేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారు. హోలీ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలి

**ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏన్కూరులో కాగడాల ప్రదర్శన**




**ప్రజాపక్షం/ ఏన్కూరు :** భగత్‌సింగ్ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లముడి రంజిత్‌కుమార్ తెలిపారు. దేశ జనాభాలో సగ భాగం ఉన్న యువత పోరాటాలతోనే ఉద్యోగ, ఉపాధి హక్కులు సాధించాలన్నారు. అఖిల భారత యువజన సమాక్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్థంతిని పురస్కరించుకుని ఏన్కూరులో కాగడాల ప్రదర్శనను నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం నుంచి బస్టాండ్ వరకు కాగడాల ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మన దేశం కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని చిరుప్రాయంలోనే భగత్‌సింగ్ పోరాడకుండా ఏది సాధించలేమన్న సందేశాన్ని ఇచ్చారన్నారు. ఆ సందేశం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రోజు రోజుకు కూనరిల్లుతున్నాయని పాలకులు ఓట్లు, సీట్లు, ఉచితాల పైనే దృష్టిసారించారు తప్ప ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. పోరాటం ఒక్కటే హక్కుల సాధనకు మార్గమని రంజిత్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు మంకెన కృష్ణ, మేడా భూషయ్య, మాదినేని వెంకన్న, బసవయ్య, నర్సింహారావు, నాగేశ్వరరావు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం కారేపల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన తీసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వై.ప్రకాష్ మాట్లాడుతూ భారత దేశ స్వేచ్ఛ స్వతంత్ర్యం కోసం నునుగు మీసాల లేత లేత వయసులో నవ్వుతూ ఉరుకంబాన్ని ముద్దాడిన యువకిశారోలని వారి బాటలో విద్యార్థి యువత పయనించాలని అలాగే మోడీ ప్రభుత్వ ఫాసిస్ట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా రైతాంగాన్ని నాశనం చేసే మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ 44 కోడ్‌లుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిన బిజెపి విధానాల వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలందరూ ఈ సందర్భంగా పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కోయిల శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాసరెడ్డి, కావేటి నాగేశ్వరరావు, ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా నాయకులు గడ్డం వెంకన్న, ఆలయం ఎర్రయ్య, నరేష్, సురేష్, సతీష్, కోటయ్య, వెంకన్న, శివయ్య, డి.రామ్మూర్తి, వై.జానకి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# రంగుల కేళీ హోలీ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రంగుల కేళి రానే వచ్చింది. వసంత కాలంలో ఈ పండుగను జరుపుకుంటారు. అన్ని మతాలు, కులాల వారు ఎంతో సంతోషంగా, సరదాగా ఈ పండుగను జరుపుకుంటారు. హోలీ అంటే చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు సంతోషంగా రంగులు పులుముకుంటూ సరదాగా గడుపుతారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా రక రకాల రంగులు ఇప్పుడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఈ పండుగ ప్రధాన ఘట్టం కాముని దహనంతో హోలీ వేడుకలు ప్రారంభమవుతాయి. హిరణ్యకశిపుని చెల్లెలు హోలికా అనే రాక్షసి దహనానికి సంకేతంగా సాంప్రదాయ పద్ధతిలో భోగి మంటలు వేస్తారు. విజయ దశమి రోజున రావణాసురుడి ప్రతిమను దహనం చేసినట్లు ఈ పండుగ రోజున హోలికాను దహనం చేస్తారు. నగరాలు, గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో కర్రలను కుప్పలుగా వేసి మంటలలో కాముని దహనం నిర్వహిస్తారు. ఆ తర్వాత రోజున హోలీ వేడుకలు జరుపుకుంటారు. మతాలు, కులాలకు అనుగుణంగా వారి వారి ఆచారాల్లో ఈ పండుగ సంబురాలను ఆనవాయితీగా జరుపుకుంటారు. పెద్దలు, పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు సంతోషంగా ఈ హోలీని జరుపుకుంటారు. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా ఈ రోజు సరదాగా గడుపుతారు. రంగులు చల్లుకుంటూ స్నేహితులతో సందడిగా జరుపుకుంటారు. చిన్నారులు సరదాగా రంగులు చల్లుకునేందుకు మార్కెట్‌లో హోలీ సందర్భంగా ప్రత్యేక ఈవెంట్లను కూడా నిర్వహిస్తున్నారు. ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో హోలీ ఈవెంట్స్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారి వద్ద నుంచి రుసుము తీసుకుంటున్నారు. ఈ ఈవెంట్స్ కోసం వయస్సుల వారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు.

# ఎన్నికల్లో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరిగేనా..?



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తకు పదవులు దక్కుతుందో లేదో అని అధైర్య పడుతున్నారు. ఈ మధ్య కాలంలో బిఆర్ఎస్ పార్టీ ఒక మాజీ శాసనసభ్యులు వర్గం కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముహూర్తం పెట్టుకున్నారని సమాచారం అందడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడింది. గతంలో వారు అధికార పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అనేక కేసులు పెట్టి జైలుకు పంపించారు. వారు అధికారంలో ఉన్నప్పుడు అనేక అవినీతి పనులు చేశారని, దళితబంధు, బిసి బందు అన్నింటికి డబ్బులు పేద ప్రజల దగ్గర వసూలు చేశారని, ఆ డబ్బులు ఇవ్వకుండా ఉండటానికి అనేక అవినీతి కేసులు కప్పిపుచ్చుకోవడానికి వారు అధికార పార్టీలో చేరుతున్నారని ప్రజలు అనుకుంటున్నారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండే నాయకులు ప్రజలు నమ్మరని వారు ఏ పార్టీలో పోయిన ఆ పార్టీకి నష్టమని ప్రజలు చర్చించుకుంటున్నారు. దయచేసి వారిని కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకునే నాయకులు ఆలోచించి చేర్పించుకోవాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కోరుకుంటున్నారు. చూడాలి మరి వారు కాంగ్రెస్ పార్టీలో చేర్పించుకుంటారా లేదా అని చూడాలి.